అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 21 జనవరి 2023
1

బీఆర్ఎస్‌లో మైనార్టీ యువకుల చేరిక

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని ఎమ్మెల్యే నివాస గృహంలో శుక్రవారం ఎంఐఎం నుండి మైనార్టీ యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే రేఖా నాయక్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అభివృద్ధిని చూసి పార్టీలో చేరినట్లు యువకులు తెలిపారు. బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం నేతకాని మహా ఆత్మీయ సమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరించారు.



రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలి

నవతెలంగాణ - ఉట్నూర్

రైతులు సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని ఎంపీపీ పంద్ర జైవంతరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఘన్‌పూర్ గ్రామపంచాయతీలో రైతు పొలాన్ని సందర్శించి, సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారాన్ని పెంచడానికి వాడకాన్ని తగ్గించి, సాంప్రదాయ బద్ధంగా వస్తున్న సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలన్నారు. రసాయన ఎరువులు వాడకంతో అనేక రోగాలను కొని తెచ్చుకుంటున్నామన్నారు. సహజ సిద్ధంగా తయారైన ఎరువులను వాడటం వల్ల అనేక లాభాలున్నాయన్నారు. ఆవుపేడ, గడ్డి, చెత్తాచెదారంతో సులువుగా సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చని తెలిపారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్న రైతుకు అభినందనలు తెలియజేశారు.

ట్రాక్టర్లు సీజ్

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ - హాజీపూర్

నవతెలంగాణలో శుక్రవారం ప్రచురితమైన 'అధికార అండా..ఇసుక దందా' కథనానికి మైనింగ్ అధికారులు స్పందించారు. వేంపల్లి శివారు గోదావరిలో ఇసుక నింపుతున్న ట్రాక్టర్లను సీజ్ చేశారు.

నోములు అందజేసిన ఎమ్మెల్యే జోగు దంపతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ పండగల విశిష్టతను తెలియచేసేలా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని స్థానిక తాలూకా మున్నూరు కాపు సంఘ భవనంలో నోముల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగురామన్న, జోగు రమ దంపతులు హాజరై శ్రీ లక్ష్మి దేవీ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక హారతులు అందచేసి లక్ష్మి దేవిని కొలిచారు. వారికి నోములు అందజేసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళలు ఒకరికొకరు నోములు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ సంఘం ద్వారా పండగ సమయంలో నోముల కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల అభినందనలు తెలియజేశారు. వినాయక చవితి, బతుకమ్మ, శారద దేవి నవరాత్రుల వేడుకలను సైతం ఘనంగా జరిపారని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ సంఘం ద్వారా ఎటువంటి కార్యక్రమాలు చేపట్టినా తన వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, సంఘం బలోపేతానికి అన్ని విధాలా అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కాళ్ల విఠల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకురాళ్లు ప్రభ, బొడగం మమత, కస్తాల ప్రేమల, రాధ, పద్మ పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం సందర్శన

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మనోరంజన్ సముదాయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని అదనపు కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. కంటి పరీక్షల కోసం వచ్చే ప్రజల సౌకర్యాలను, చేసే పరీక్షలను, వారికి అందజేసే మందులను, కళ్లద్దాలను అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగు కేంద్రానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌కు సూచించారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ లింగయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గౌడ సంఘాల ఐక్యతకు కృషి చేయాలి

నవతెలంగాణ-తాండూర్

గౌడ సంఘాల ఐక్యతకు కలిసికట్టుగా కృషి చేయాలని మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి మొండిగౌడ్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ మోకు దెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి భూసారపు మొండిగౌడుమాట్లాడుతూ గౌడ కులస్తుల హక్కుల సాధన కోసం కుల సభ్యులు నిరంతరం పాటుపడుతున్నారన్నారు. మోకు దెబ్బ గౌడ కులస్తుల సంక్షేమం కోసం పాటుపడుతున్న నర్సాగౌడ్ మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో సైతం రాణించి గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి శంకర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమండ్ల భాస్కర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి బూరగడ్డ పున్నంగౌడ్, పూదారి విజయ్‌గౌడ్, వెంకటేష్ సాయి కృష్ణ పాల్గొన్నారు.

27న అంగన్వాడీల డీడబ్ల్యుఓ కార్యాలయం ముట్టడి



నవతెలంగాణ-జన్నారం

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. శుక్రవారం సీఐటీయు కార్యాలయంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీలు 40 సంవత్సరాలుగా పనిచేస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇంటి అద్దెలు, పెండింగ్ టిఏ, డిఏ, గ్యాస్ బిల్లులు వెంటనే చెల్లించాలని, మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు సీనియర్ నాయకులు కె.బుచ్చయ్య, అంగన్వాడీ జిల్లా కమిటీ సభ్యులు నస్రీన్ బేగం, జిల్లా నాయకులు టి.లక్ష్మి, కె.రాజమణి పాల్గొన్నారు.

7వ రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) 7వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం ఆధ్వర్యంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జనవరి 29న జరగనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను ఐక్యం చేసి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై పోరాటానికి భవిష్యత్ కార్యక్రమం రూపొందించడానికి ఈ వేదిక సహాయపడుతుందని పేర్కొన్నారు. సింగరేణి ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణను వ్యతిరేకిస్తూ పర్మినెంట్ కార్మికులు చేస్తున్న పోరాటాలలో భాగస్వామ్యం అవుతూ చట్టబద్ధ హక్కుల పరిష్కారం కోసం సింగరేణి కాంగ్రెస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరణ్, అప్పారావు, అంకుల్, సుధాకర్, రాంబాబు, శంకర్, ఈశ్వరరావు, తిరుపతి, గౌరమ్మ, హంస, మేరీ, శారద, కవిత, లక్ష్మీ పాల్గొన్నారు.

పోషకాల మిళితం..బలహీనత దూరం..!

- రేషన్ బియ్యంలో పలు రకాల విటమిన్లు, మినరల్స్
- ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో ప్రతి నెలా పంపిణీ
- రక్తహీనత నివారణకు యంత్రాంగం చర్యలు
- అపోహలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇన్నాండ్లు కంట్రోల్ బియ్యం పేరు చెప్పగానే అవి మనం తినలేమని కొందరు అంటుంటారు. మరికొందరు రేషన్ దుకాణంలో బియ్యం తీసుకున్నా ఇతరులకు అమ్మేస్తుంటారు. ఇలా వచ్చిన డబ్బులతో బయటి మార్కెట్‌లో సన్నరకం బియ్యం తీసుకుంటారు. ఈ బియ్యాన్ని అసలు లెక్కలోకే తీసుకునేవారు కాదు..తాజాగా ఈ పరిస్థితి దూరమవుతోంది. ప్రస్తుతం రేషన్ దుకాణానికి ఈ బియ్యం రాగానే అద్దుకొని తీసుకుంటున్నారు. కారణమేంటంటే.. కేంద్రప్రభుత్వం కొన్ని నెలల నుంచి ఈ జిల్లాలకు ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ చేస్తోంది. కేంద్రప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద నాలుగు జిల్లాలను ఎంపిక చేయగా.. ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను సైతం ఎంపిక చేసింది. గతేడాది మే నుంచి ఈ జిల్లాల్లో ప్రతి నెలా పంపిణీ జరుగుతోంది. కానీ ప్లాస్టిక్ బియ్యం పంపిణీ అవుతుందనే అపోహతో కొందరు ఈ బియ్యాన్ని తీసుకోవడం లేదు. దీంతో అధికారులు ఇలాంటి అపోహలను దూరం చేసి అవగాహన కల్పిస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పౌష్టికాహారం లభించక రక్తహీనతతో బాధపడుతున్న ప్రజలను ఈ బాధల నుంచి గట్టెక్కించాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం ఈ ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీకి నిర్ణయించింది. తొలుత దేశవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టు కింద 24 రాష్ట్రాల్లో 151 జిల్లాల్లో అమలు చేయాలని భావించింది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో నాలుగు జిల్లాలను రెండో విడతలో ఎంపిక చేసింది. తొలి దశలో పాఠశాలలకు సరఫరా చేయగా.. రెండో దశలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తోంది. గతేడాది మే నెల నుంచి ప్రతి నెలా రేషన్ దుకాణాల ద్వారా ఈ బియ్యమే పంపిణీ జరుగుతోంది. కానీ కొంత మంది ఈ బియ్యం తీసుకునేందుకు నిరాకరిస్తుండగా.. మరికొందరు బయటి మార్కెట్‌లో కిలో రూ.10చొప్పున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ అనేక మంది పేదలు మాత్రం ఈ రేషన్ బియ్యమీదనే ఆధారపడి కడుపునింపుకొంటున్నారు. గతానికి భిన్నంగా రేషన్ దుకాణాల్లో ప్రస్తుతం సన్నరకం బియ్యంతో పాటు వివిధ రకాల విటమిన్లు, మినరల్స్ మిళితం కావడంతో ప్రయోజనకరంగా మారుతోంది.

ప్లాస్టిక్ కాదు..పోషకాల బియ్యం..!

ప్రస్తుతం పంపిణీ అవుతున్న బియ్యాన్ని చాలా మంది ప్లాస్టిక్ బియ్యంగా అపోహ పడుతున్నారు. వీటిని తినేందుకు మక్కువ చూపించడం లేదు. కానీ అసలు వాస్తవంలో ఈ బియ్యంలో ఐరన్, విటమిన్ బి12, ఫోలిక్ ఆసిడ్ గుళికలను కలుపుతున్నారు. తొలుత నూకల బియ్యాన్ని పిండిగా తయారుచేసి



అందులో ఈ విటమిన్లను మిశ్రమం చేస్తున్నారు. గుళికలుగా తయారుచేసి ల్యాబ్‌లో తయారుచేసిన తర్వాతనే రేషన్ బియ్యంలో కలుపుతున్నారు. ప్రభుత్వ సూచనల ప్రకారం నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం 99కిలోల బియ్యంలో ఒక కిలో మినరల్స్ కలిగిన ఈ గుళికలు కలుపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిని రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా క్రమంగా రక్తహీనత దూరమై శరీరానికి బలవర్ధకమైన పోషకాలు లభిస్తాయని అధికారులు చెబుతున్నారు. ప్లాస్టిక్ బియ్యం సరఫరా అవుతోందని ప్రజల్లో అపోహలు ఉండటంతో వాటిని తొలగించేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు గ్రామాల వారీగా వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. ఈ బియ్యం ప్రయోజనాలపై వివరిస్తున్నారు.

విక్రయించడం ద్వారా నష్టం..!

ప్రభుత్వం సదుద్దేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న ఈ బియ్యం చాలా చోట్ల దుర్వినియోగమవుతోంది. సన్నరకాలకు అలవాటుపడిన వారు ఈ కంట్రోల్ బియ్యాన్ని బయటి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అలా వచ్చిన డబ్బులకు ఇంకొంత జత చేసి సన్నరకం బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ఇలా విటమిన్లు కలిగిన ఈ బియ్యం పక్కదారి పట్టడంతో అనేక మంది నష్టపోవాల్సి వస్తోంది. కానీ ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలో పేదలు అధికంగా ఉండటంతో ఈ బియ్యం మీదనే ఆధారపడుతుంటారు. సరైన పౌష్టికాహారం లభించని కారణంగా అనేక మంది రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. పలు సర్వేల్లోనూ ఈ సమస్య ఉన్నట్లు తేలింది. దీనిని రూపుమాపేందుకు ప్రభుత్వం ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ చేసేందుకు నిర్ణయించింది. ఇది సత్ఫలితాలిస్తే మిగితా జిల్లాల్లోనూ అమలు చేసేందుకు ప్రభుత్వం భావిస్తోందని అధికారులు చెబుతున్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం : టి.కిరణ్‌కుమార్, డీఎస్‌ఓ, ఆదిలాబాద్



జిల్లాలో రక్తహీనత నివారణకు ప్రభుత్వం కొన్ని నెలల నుంచి ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ చేస్తోంది. వివిధ రకాల విటమిన్లు, మినరల్స్ కలిగిన ఈ బియ్యంతో అనేక ప్రయోజనాలుంటాయి. కొందరు ప్లాస్టిక్ బియ్యమనే అపోహలకు గురవుతున్నారు. ఇది సరికాదు. ఈ బియ్యం ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరు దీనిని తీసుకోవడం ద్వారా రక్తహీనత దూరమయ్యేందుకు అవకాశం ఉంటుంది.

జిల్లా	కార్డులు	బియ్యంకోటా(మె.ట)
ఆదిలాబాద్	1,92,078	3494
కుమురంభీం	1,37,284	2970

కంటి వెలుగు దేశానికి ఆదర్శం



నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోన్కల్ గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శమన్నారు. దేశం తెలంగాణ వైపు చూస్తుందన్నారు. కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్నింట్లో ముందుందన్నారు. మండలంలోని ఇందన్‌పల్లి, పోన్కల్, జన్నారం గ్రామాలలో మొదటి విడత శిబిరాలు ప్రారంభించామని తెలిపారు. త్వరలో అన్ని గ్రామాల్లో ప్రారంభిస్తామన్నారు.

అసోసియేషన్ భవనానికి రూ.2లక్షలు

మండలంలోని కారు, టాటా ఏసీ, జీప్ అసోసియేషన్ సంఘ భవనానికి రూ.2లక్షలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే రేఖా నాయక్ హామీ ఇచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో అసోసియేషన్ అధ్యక్షునిగా 15వసారి ఎన్నికైన షేక్ బాబా సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కారు, జీపు, టాటా ఏసీ వాహనాలలో పరిమితికి మించి ప్యాసింజర్‌లను ఎక్కించుకోవద్దన్నారు. తప్పనిసరిగా అన్ని రకాల ధృవపత్రాలు కలిగి ఉండాలన్నారు. ఇన్సూరెన్స్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా షేక్ బాబా ఎమ్మెల్యే రేఖా నాయక్, టీఎన్జీవో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యాంనాయక్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పోన్కల్ సర్పంచ్ జక్కు భూమేష్, జన్నారం సర్పంచ్ భూషణవేణి గంగాధర్‌గౌడ్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువా జనార్ధన్ పాల్గొన్నారు.

29న పద్మశాలీ వధూవరుల పరిచయ వేదిక

నవతెలంగాణ-దండేపల్లి

ఈ నెల 29న నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సింగరేణి పాత కమ్యూనిటీ భవనంలో జరగనున్న పద్మశాలి నూతన వధూవరుల పరిచయ వేదికను విజయవంతం చేయాలని సంఘ నాయకులు చిలువేరు సదానందం పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పద్మశాలి సంఘం నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పరిచయ వేదికకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పద్మశాలీలు హాజరవుతారని, జిల్లా వ్యాప్తంగా పద్మశాలి కులస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వివాహ బాంధవ్యాలను కలుపుకునేందుకు ఇది ఒక చక్కని వేదిక అవుతుందన్నారు. పద్మశాలి పిల్లల వివాహం చేయాలని భావిస్తున్న తల్లిదండ్రులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సిరిపురం రవీందర్, బొద్దున సత్యనారాయణ, వేముల రాజ గురువయ్య, వద్నాల శంకర్, వడ్డేపల్లి దేవయ్య, అలిశెట్టి లక్ష్మణ్, స్వర్గం శంకరయ్య, బూర్ల వెంకటేశ్వర్లు, ఎనగందుల సత్యం, దుబ్బయ్య, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

రోజువారి కంటి పరీక్షల లక్ష్యాన్ని అధిగమించాలి



నవతెలంగాణ-జైపూర్

కంటి వెలుగు పరీక్షల రోజువారి లక్ష్యాన్ని అధిగమించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాహుల్ ఆదేశించారు. శుక్రవారం బెజ్జాల గ్రామపంచాయతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రోజు వారీగా 150 మందికి తగ్గకుండా కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కంటి పరీక్ష కేంద్రంలో వైద్య సేవలు అందిస్తున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సందర్భంలో కంటి అద్దాలు అందజేయాలని సూచించారు. కంటి పరీక్షల కోసం వచ్చిన రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ పరీక్షా కేంద్రం పరిధిలో అర్హులుగా గుర్తించిన వారందరిని పరీక్షించి చూపు సమస్య ఉన్నవారికి అద్దాలు అందజేయాలని సూచించారు. రోజువారి లక్ష్యాలపై దృష్టి సారించాలని ఎంపీడీవో సత్యనారాయణతో పాటు సర్పంచ్ జయపాల్‌గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆర్ఎంపీల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని యాదవ సంఘ భవనంలో శుక్రవారం ఆర్ఎంపీ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులతో పలు అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే ఎరామన్న మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు కనీస వైద్య సేవలందించే ఆర్ఎంపీల సమస్యలను పరిష్కరించేందుకు పూర్తి చర్యలు తీసుకుంటానని అన్నారు. ఆర్ఎంపీలకు అందించే సర్టిఫికెట్‌ల విషయమై మంత్రి హరీశ్‌రావుతో చర్చిస్తానని పేర్కొన్నారు. సంఘం భవన నిర్మాణం సహా అర్హులైన పేదలను గుర్తించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లేదా ఇల్లు నిర్మించుకోడానికి ప్రభుత్వం నుండి సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాళ్లబండి శంకర్, కావటి రమేష్, ఉమేష్, అశోక్, వెంకట్, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, డైరెక్టర్ పరమేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో అభివృద్ధి పనులపై సమీక్ష



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో శుక్రవారం అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గత నెల డిసెంబర్‌లో ఆర్జీయూకేటీ యూనివర్సిటీని సందర్శించిన మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి సూచన మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ అర్జీయూకేటీ యూనివర్సిటీని సందర్శించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ, జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ, డైరెక్టర్ సతీష్ కుమార్ మున్సిపల్ శాఖ అధికారులు సమావేశంలో పాల్గొని జరుగుతున్న పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ మాట్లాడుతూ క్యాంపస్‌లో సుమారు 75ఎకరాల విస్తీర్ణంలో జరుగుతున్న సుందరీకరణ పనుల గూర్చి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ అధికారులకు వివరించారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ కొన్ని సూచనలు చేశారు. ప్రధానంగా రోడ్డుకు ఇరువైపులా వీధి లైట్లను అమర్చడం, ఈకో పార్క్ సంబంధించిన పనులు, మొక్కలు గురించి వివరించారు. యూనివర్సిటీకి చెందిన సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా ఫిబ్రవరి మొదటి వారంలో హైదరాబాద్‌ను సందర్శించి నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించాలని వీసీకి సూచించారు. అనంతరం ఎకో టూరిజం ప్రాజెక్టు పనులను యూనివర్సిటీ అధికారులతో కలిసి స్పెషల్ చీఫ్ సెక్రటరీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ హేమంత్ బోర్కడే, రాంబాబు, అర్జీయూకేటి అధికారులు పాల్గొన్నారు.

కంటి వెలుగుపై అవగాహన కల్పించాలి

ఆదిలాబాద్ రూరల్ : కంటివెలుగు కార్యక్రమంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి క్యాంపులకు వెళ్లి పరీక్షలు చేయించుకునే విధంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొలిపుర, ఆదిలాబాద్ మండలంలోని అంకోలి, అంకాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను కలెక్టర్ పరిశీలించారు. కంటి వెలుగు క్యాంపులలో హాజరైన లబ్దిదారులతో స్వయంగా మాట్లాడి కంటి చూపు, పరీక్షలు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా క్యాంపులలో వివిధ టేబుల్‌ల వద్ద ఉన్న సిబ్బంది పని తీరును, రికార్డుల నమోదు, కంటి చూపు పరీక్షల విధానాన్ని, ఆటో రిఫ్రక్టర్ యంత్రం ద్వారా పరీక్ష, మెడికల్ ఆఫీసర్ సూచనలు, మందులు, కళ్లజోళ్లు పంపిణీ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్యాంపులో పనిచేసే సిబ్బంది ప్రతి రోజు ఉదయం 9 గంటల లోపు హాజరై విధుల్లో చేరాలన్నారు. సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులు వారి పరిధిలోని ప్రజలను క్యాంపులకు పంపిస్తూ కంటి పరీక్షలు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. పట్టణ పర్యటనలో అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డా.సాధన, కౌన్సిలర్ జోగు రవి పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత పర్యటనలో మండల ప్రత్యేక అధికారి రమణ, ఎంపీఓ ఆనంద్, ఆయా మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్యలు పరిష్కరించాలి

బేల : గ్రామాల్లో నెలకొన్న తాగు నీటి సమస్యలు పరిష్కరించాలని సభ్యులు కోరారు. శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి వనిత ఠాక్రె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి విన్పించగా సభ్యులు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ వనిత గంభీర్ మాట్లాడుతూ రానున్న వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని విద్యుత్, తాగు నీటి సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బేల సర్పంచ్ వట్టిపెల్లి ఇంద్రశేఖర్ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణంలో గుత్తేదారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని ఎంపిపి సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. సర్పంచ్, జెడ్పిటిసిగా పని చేసి ఇటీవల మృతి చెందిన రాజారెడ్డికి సమావేశంలో మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం జైనథ్ మార్కెట్ చైర్‌పర్సన్‌గా గోడాం వర్ష ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మండల ప్రజాప్రతినిధులు, అధికారులు శాలువా కప్పి సన్మానించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాగోబా జాతరకు ఆర్టీసీ బస్సులు

ఆదిలాబాద్ కలెక్టరేట్ : ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా ఈ నెల 21 నుండి 28 వరకు భక్తుల సౌకర్యార్థం ఆదిలాబాద్, ఉట్నూర్, మంచిర్యాల్, ఆసిఫాబాద్ డిపోల అన్ని బస్సులు వయా కేస్లాపూర్ వెళ్తాయని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తుల కొరకు అదిలాబాద్ డిపో నుండి జాతరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంజినీర్ ఎంట్రన్స్ ఎగ్జామ్ కోసం..

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎంట్రన్స్ ఎగ్జామ్ కొరకు ఈ నెల 22న ఆదిలాబాద్ నుండి నిజామాబాద్‌కు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన తెలిపారు. ఈ బస్సుకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో లేదా నేరుగా బస్‌స్టేషన్‌లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేరే ప్రాంతాలకు అవసరం ఉన్నవాళ్లు 9959226002, 7382840334 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

సారంగాపూర్ : కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతోపాటు ఆలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన రెండవ విడత కంటి వెలుగు శిబిరాలను శుక్రవారం జడ్పీ సిఈఓ సుధీర్‌కుమార్, ఆర్డీవో స్రవంతితో కలిసి సందర్శించి కంటి పరీక్షలు నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ సీఎం కేసిఆర్ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని ఉచిత కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ముఖ్యంగా పెద్ద వయస్సు కలిగిన వారికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఊరికి వచ్చి ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి ఆపరేషన్ సైతం చేసి కళ్లద్దాలు, మందులను అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సరోజ, వైస్ ఎంపీపీ పఠాని రాధ భూమేష్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్‌లు సుజాత నర్సారెడ్డి, దండు రాధ సాయి కృష్ణ, ఎంపీటీసీ వెంకటరమణరెడ్డి, వైద్యులు అలీ వేదవ్యాస్, పాల్గొన్నారు.

ఏఐటీయూసీతోనే హక్కుల పరిరక్షణ

గుడిహత్నూర్ : కార్మిక పోరాటాలపై దశాబ్దాల చరిత్ర కలిగిన ఎఐటియూసితో కార్మిక హక్కుల పరిరక్షణ జరుగుతుందని ఎఐటియూసి రాష్ట్ర కార్యదర్శి విలాస్ తెలిపారు. శుక్రవారం మండలంలో ఎఐటియూసి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఎఐటియూసి పోరాటాలకు ఆకర్షితులై 104 మంది అంగన్వాడీలు, హెల్పర్లు సభ్యత్వం తీసుకున్నారన్నారు. కార్మిక హక్కుల సాధనకు ఎఐటియుసి నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా కార్యదర్శి సిర్రా దేవేందర్, ఎఐటియూసి మండల కార్యదర్శి ఉస్మాన్, అంగన్వాడీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డి.ఛాయా, కే.ఇందు, నాయకులు ఎ.చంద్రకళ, ఆర్.సురేఖ, ఆర్.సంగీత, కే.లక్ష్మీ, సలీమా పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చెట్టును ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కడెం

ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొని బోల్తాపడి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని మొర్రిగూడెం గ్రామానికి చెందిన మోకిరాల గణేష్(36) బైక్‌పై నిర్మల్ వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపుతప్పి నర్సాపూర్ వద్ద బోల్తాపడింది. దీంతో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలోని శిశుమందిర్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, అడిషనల్ కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్క వ్యక్తికి కంటిపరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలతో పాటు మాత్రలను అందించాలని సూచించారు. కంటి శిబిరం వద్ద ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. వృద్ధులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి, ప్రతి ఒక్కరు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జిల్లా డీఎంహెచ్ఓ ధన్ రాజు, సర్పంచ్ లక్ష్మణరావు, ఆర్డీఓ రవికుమార్, కంటి వెలుగు ఇన్‌చార్జీ అధికారి శ్రీనివాస్ రెడ్డి తహసీల్దార్ నారాయణ, ఎంపీడీఓ నాగనాథ్ పాల్గొన్నారు.

నాగోబా జాతరకు వేళాయె...

- నేటి అర్ధరాత్రి నాగోబాకు మహాపూజ
- హాజరు కానున్న జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 24 న దర్బార్







నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే సమక్క, సారక్క జాతర తరువాత రెండో అతిపెద్ద జాతరగా పేరు గాంచిన కేస్లాపూర్ జాతరకు వేళైంది. ప్రతి ఏటా పుష్యమాసంలో అర్ధరాత్రి గోదావరి నుంచి తెచ్చిన గంగాజలంతో మెస్రం వంశీయులు ఖటోడ (పూజారి) కోసేరావ్, ధర్ము, హన్మంతు, పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు, చిన్నుపటేల్, ప్రధాన్‌ల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన మెస్రం వంశీయులు వారి సాంప్రదాయ వాయిద్యాలైన తుడుం, పెప్రి, కాలికోమ్, వాయిస్తూ, కాగడాలను వెలిగిస్తూ గంగా జలంతో నాగోబాకు జలాభిషేకం చేస్తూ సాంప్రదాయ పూజలు చేస్తారు. ఈ పూజకు జిల్లా కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీఓ హాజరవుతారు. ఆ రోజు నుంచి జాతర ప్రారంభమవుతుంది. ఈ జాతరకు జిల్లా ప్రజలే గాక మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఎంపీ, ఒరిస్సా, తదితర రాష్ట్రాలనుంచి ప్రజలు తరలి వస్తారు. ఈ సారి సుమారు 5 లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం వుందని అధికారులు ఏర్పాట్లు చేశారు.

నాగోబా జాతరపై నవతెలంగాణ ప్రత్యేక కథనం.

నాగోబాపై పురాణ గాథ..

నాగోబా చరిత్రపై ఆదివాసుల రకరకాలుగా చెబుతారు. పూర్వం మెస్రం కుటుంబానికి చెందిన నాగాయి మోతిరాణికి నాగేంద్రుడు కలలో కనిపించి సర్పం రూపంలో ఆమె గర్భాన జన్మిస్తానని చెప్పాడట. ఆ కల నిజమైందని గోండుల నమ్మకం. సర్పం రూపంలోని నాగేంద్రుడి తల్లి, తమ్ముడి కూతురు గౌరితో వివాహం జరిపించిదట. అత్త ఆజ్ఞా మేరకు గౌరీ భర్తను బుట్టలో పెట్టుకొని గోదావరికి పయనం కాగా ఒక చోట పాము ఉడుము రూపంలో కనిపించిందని వారి నమ్మకం. ఆ తరువాత ఉడుంపూర్ నుంచి గర్మిల్ల వరకు ఇతని కోసం వెతికిన గౌరీ గోదావరి లోని సప్తగుండంలో కలిసి పోయిందని, ఆమె వెంట ఉంచిన ఏద్దు రాయిగా మారిందని భక్తుల విశ్వాసం. ఆ తరువాత పెళ్లైన ప్రతి జంట ను నాగేంద్రుడు సన్నిధిలో పరిచయం చేయాలని, నాగేంద్రుడు కేస్లాపూర్ గుట్ట వైపు వెళ్లి పోయాడని చరిత్ర తెలుపుతోంది. ఇక్కడే నాగోబా దేవాలయం వెలిసిందని అప్పటి నుంచి ఇక్కడ ప్రతి ఏడాది పుష్య మాసం అమావాస్య రోజున నాగేంద్రుడు ప్రత్యక్ష మౌతాడని ఆదివాసుల విశ్వాసం. అప్పటినుంచి ఇక్కడ జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

గోదావరి జలంతో అభిషేకం

మెస్రం వంశీయులు పక్షం రోజుల ముందు నుంచే కాలినడకన ప్రయాణించి జన్నారం మండలంలోని హస్తినమడుగులోని గోదావరి నది నుంచి తెచ్చిన పవిత్ర గంగాజలంతో మర్రిచెట్టు వద్దకు వచ్చి బస చేస్తారు. పుష్య అమావాస్య రోజున గంగాజలంతో ఆలయాన్ని శుద్ధి చేసి, అనంతరం వారి సాంప్రదాయ వాయిద్యాలతో పూజ సమయంలో మొలకెత్తే నవధాన్యాలను, ఒక రాగి చెంబులో పాలను పెట్టి పైన తెల్లని వస్త్రంతో కప్పి ఉంచుతారు. ఈ వస్త్రం పైకి లేచే వరకు వారి సాంప్రదాయ వాయిద్యాలను వాయిస్తూ.. పూజలు చేస్తారు.. చెంబుపై వస్త్రం కదిలే వరకు పూజలు చేస్తూనే ఉంటారు. ఈ చెంబులో నుంచి నాగేంద్రుడు పాలను తాగుతాడని ఇప్పటికిని మెస్రం వంశీయుల విశ్వాసం. ఈ పూజలో మెస్రం వంశీయులే గాక పాట్లాల్, హావల్దార్, గైక్వాడిలు మొదలైన వారు పాల్గొంటారు.

పెద్దల పేరిట కర్మ కాండలు

పూజకు ముందు మర్రిచెట్టు ఆవరణలో కర్మకాండ నిర్వహిస్తారు. మెస్రం వంశీయులు తమ వంశంలో చనిపోయిన పూర్వీకుల పేరిట పిండ ప్రదానం చేసి కర్మకాండలు చేస్తారు. దీంతో చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలుగుతుంది వారి ప్రగాఢ విశ్వాసం.

కొత్త కోడళ్ల భేటింగ్..(పరిచయం.)

నాగోబా పూజ అనంతరం అర్ధరాత్రి నుంచి నాగోబా సన్నిధిలో మెస్రం కొడళ్లకు వారి వారి కుల పెద్దలకు భేటింగ్ (పరిచయం) నిర్వహిస్తారు. ఈ భేటింగ్‌లో పాల్గొన్న తరువాతే మెస్రం కొడళ్లకు నాగోబా దర్శనానికి అనుమతి లభిస్తుంది. అంత వరకు వారికి నాగోబా ఆలయంలో ప్రవేశం నిషిద్ధం.

గోవాడలో బస.. కుండల్లో వంట..

నాగోబా పూజ అనంతరం మెస్రం కుటుంబాలు మందిరం పక్కనే ఉన్న గోవాడలోకి బసచేస్తారు. ఇక్కడ దినమంతా ఉపవాస దీక్షలు చేపట్టి 22 కితాల వారిగా కొత్త కుండల్లో వంటలను చేస్తారు. దేవునికి నైవేద్యం సమర్పించి తరువాత పవిత్ర ఉపవాస దీక్షను విరమింప చేయడం వారి ఆచారం.

మెస్రం అల్లుండ్లకు పెద్ద పీట

నాగోబా పూజ అనంతరం నాగోబా ఆలయ అవరణలో పాత పుట్టను తవ్వి కొత్త పుట్టను తయారు చేస్తారు. ఈ పుట్ట తయారీకి మెస్రం ఆడపడుచులు నీటిని అందించగా వారి అల్లుండ్లు మట్టిని తవ్వి బురదతో కొత్త పుట్టను తయారు చేస్తారు. ఈ సందర్భంగా వారి అల్లుండ్లకు కట్నం, కానుకలు ఇచ్చి పెద్దపీట వేస్తారు. ఈ పుట్ట ఎంత ఎత్తుగా పెరుతుంది అంతగా పాడిపంటలు సమృద్ధిగా పండి, కుటుంబం ఏడాది కాలం సుఖ శాంతులతో విరాజిల్లుతోందని నమ్మకం.

సతిదేవత, పెర్సాపెన్‌కు పూజలు..

జాతర మూడవ రోజున ఆలయం సన్నిధిలోని సతిదేవతకు పెర్సా పెన్(పెద్ద దేవుడు)కు మహిళలు, పురుషులు వేర్వేరుగా పూజలు చేస్తారు. సతిదేవతకు నవధాన్యాలతో మహిళలు పూజలు చేయగా, పెర్సాపెన్‌కు పురుషులు వారి సాంప్రదాయ పూజలు చేస్తారు.

బేతాల్ పూజ, కర్రసాము ఆట..

జాతర చివరి రోజున వారి ఆచార సాంప్రదాయం ప్రకారం బేతాల్ దేవతకు పూజలు చేసి కర్రసాము ఆట ఆడుతారు. మెస్రం వంశీయులైన పటేల్ వెంకట్‌రావు, కొత్వాల్ తిరుపతిలు కర్రసాము (వెదురు కట్టే)తో ఆట ఆడుతారు. అనంతరం మహిళలు పురుషులు కలిసి నృత్యాలు చేసి ముగింపు పలుకుతారు. అనంతరం శ్యామ్‌పూర్‌లోని బుడుందేవ్ జాతరకు పయణమవ్వడం ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయం.

24న దర్బార్...

నాగోబా జాతర సందర్భంగా 24 న గిరిజన దర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 1946లో మొదటి గిరిజన దర్బార్ నిజాం సర్కార్ హయంలో గిరిజనుల జీవన స్థితి గతులపై ఇంగ్లాండ్‌కు చెందిన మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమాన్ డార్ఫ్‌కు అధ్యయనం పంపించారు. అయితే ఆనాడు ఆయన కేస్లాపూర్ జాతరలో దర్బార్‌ను ఆరంభించారని గిరిజన పెద్దలు తెలిపారు. అప్పటి నుంచి అక్కడ దర్బార్‌ను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

రూ.5 కోట్లతో మెస్రం వంశీయులచే మందిర నిర్మాణం...

ఈ జాతర అభివృద్ధికి ప్రభుత్వం రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేయగా, మెస్రం వంశీయులు గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రతి మెస్రం కుటుంబం నుంచి విరాళాలను సేకరించి, రూ.5 కోట్లతో మందిర నిర్మాణం చేశారు. ఈ మందిర నిర్మాణానికి కర్నూల్ లోని ఆళ్లగడ్డ నుంచి తెచ్చిన ప్రత్యేక ఎర్రటి రాతితో నిర్మాణం చేపట్టి చరిత్రలో నిలిచి పోయారు.











మున్సిపాలిటీ కోసం ప్రతిపాదనలు పంపండి

నవతెలంగాణ-ముథోల్

ముథోల్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ పురపాలక, పట్టణ అభివృద్ధి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ అరవింద్ కుమార్ నిర్మల్ జిల్లా కలెక్టర్ ముషారఫ్ ఆలీ పారూఖీని ఆదేశించారు. శుక్రవారం ముథోల్ శివాలయ ఆవరణలో కంటి వెలుగు కేంద్రాన్ని స్పెషల్ చీఫ్ సెక్రటరీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ముథోల్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని చీఫ్ సెక్రటరీని కోరారు. దీంతో వెంటనే స్పందించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ పక్కనే ఉన్న జిల్లా కలెక్టర్‌కు మున్సిపాలిటీ కోసం ప్రతిపాదన తయారు చేసి పంపాలని ఆదేశించారు. కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించిన పలు వివరాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ బొర్కడే, ఆర్డీఓ రవికుమార్, ఉప వైద్యాధికారి ఇద్రోజ్ గోరి, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీఓ సురేష్ బాబు, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు అఫ్రోజ్ ఖాన్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, సర్పంచ్ రాజేందర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతకు దారి తీసిన బీజెవైఎం ఆందోళన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల పెండింగ్ స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజెవైఎం ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా శుక్రవారం బస్టాండ్ ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. గత మూడు సంవత్సరాల ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కాసేపు విద్యార్థి సంఘం నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరుగగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనంతరం వారిని పోలీసుల వ్యాన్‌లో ఎక్కించి అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి రాళ్లబండి మహేందర్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, కార్యదర్శి రాకేష్, నాయకులు సురేందర్, గోపి ఉన్నారు.

మొక్కల సంరక్షణలో సర్పంచ్



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలనే ఉద్దేశంతో సర్పంచ్ వాటికి నీళ్ల పట్టిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మండలంలోని పల్లె ప్రకృతివనంతో పాటు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు రామాయి గ్రామ సర్పంచ్ కర్ల విఠల్ రోజు నీళ్ల పడుతున్నాడు. గ్రామపంచాయతీకి వచ్చే నిధులు సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. కూలీలు రాకపోవడంతో మొక్కలను రక్షించాలని తానే స్వయంగా నీళ్ల పట్టిస్తున్నాడు. మండలంలోని పలువురు సర్పంచ్‌లకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

అడవిలో నిప్పు పెట్టకుండా కాపాడాలి

నవతెలంగాణ-పెంబి

అడవిలో నిప్పు పెట్టకుండా అడవిని ఎలా కాపాడుకోవాలని పెంబి రెంజ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇటిక్యాల గ్రామంలో అటవీ, వన్యప్రాణులను నిప్పు నుండి ఎలా సంరక్షించాలి, అటవీలో నిప్పు ఎంత ప్రమాదకరమైనది. దాని నుండి వచ్చే ప్రమాదాలు గురించి గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దల సమక్షంలో అటవీ శాఖ పెంబి రేంజ్ తరపున అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేందర్, ఇటిక్యాల సర్పంచ్ కే.ప్రతాప్ నాయక్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, ఇటిక్యాల సెక్షన్, జెడ్ కింగ్ ఫిషర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, ఎంగ్లాపూర్ సెక్షన్ బి.సంతోష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, ఇటిక్యాల్ బీట్ శివకుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, ఎంగ్లాపూర్ పాల్గొన్నారు.

అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం నేర్పించి, అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక గజిటెడ్ నెంబర్.1 ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి బోధనోపకరణముల మేళా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధనాంశాలు వివరించాలని అన్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేలా పటాల ద్వారా వివరించాలని అన్నారు. మండల స్థాయిల్లో జరిగిన ప్రదర్శన మేళాలో ఎంపిక చేయబడిన వాటిని జిల్లా స్థాయిలో తెలుగు, ఉర్దూ 400ల ప్రదర్శనలను ప్రదర్శించడం జరుగుచున్నదని తెలిపారు. ఈ విద్య సంవత్సరంలో ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎన్ కార్యక్రమాలపై ప్రత్యేక ఫోకస్ కనబరిచి విద్యార్థులు సామర్థ్యాన్ని పెంపొందించడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా 3, 5 తరగతుల విద్యార్థుల పఠన శక్తిని పెంపొందించడం జరిగిందన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇదే స్థాయిలో ప్రతిభ కనబరచాలని, అందుకు ఉపాధ్యాయ వర్గం కృషి చేయాలనీ ఆకాంక్షించారు. రానున్న పదోతరగతి వార్షిక పరీక్షల్లో గత సంవత్సరం కంటే ఉత్తీర్ణత శాతం పెంచేలా విద్యార్థులకు రివిజన్ క్లాసులు నిర్వహించాలని అన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ విద్యార్థులకు తొలిమెట్టు కార్యక్రమం కింద అర్థవంతమైన తరగతులు నిర్వహించాలని అన్నారు. విద్యార్థులు నేర్చుకున్న ప్రతిభ పాటవాలను ప్రదర్శించడం జరుగుచున్నదని అన్నారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలోని సుమారు 400 మంది విద్యార్థులు ప్రదర్శనలు ఇస్తున్నారని తెలిపారు. పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించడానికి మన ఊరు- మన బడి కార్యక్రమం కింద కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా తయారు చేస్తున్నామని తెలిపారు. సమాజంలో ఉత్తమ విద్యార్థులుగా తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు శ్రీనివాస్, సతీష్, అశోక్ స్వామి, ఎంఈఓ జయశీల, సెక్టోరల్ అధికారులు నర్సయ్య, నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మున్సిపల్ శాఖ కమిషనర్

నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారిని శుక్రవారం రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్ అరవింద్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న వీరిని ఆలయ అధికారులు అర్చకులు మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో మున్సిపల్ శాఖ కమిషనర్ అరవింద్ కుమార్‌చే ఆలయ అర్చకులు ప్రత్యేక కుంకుమార్చన పూజలు జరిపించి హారతినిచ్చి ఆశీర్వదించారు. ఆలయ చైర్మెన్ శరత్ పాటక్ మున్సిపల్ శాఖ కమిషనర్ శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. వీరి వెంట జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, అడిషనల్ కలెక్టర్లు హేమంత్ బోర్కాడే, రాంబాబు, ఆర్డీఓ రవికుమార్, తహసీల్దార్ నారాయణ పాల్గొన్నారు.

పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని రాజీవ్‌చౌక్ చౌరస్తాలో పట్టణ ఎస్ఐ బి.అశోక్ డ్రంక్అండ్‌డ్రైవ్ శుక్రవారం రాత్రి నిర్వహించారు. వాహనాలకు సరియైన పత్రాలు లేనివారికి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడుపరాదని, నడిపితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బార్ అసోసియేషన్‌లో క్రీడా పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత ముఖ్యఅతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ మేరకు క్యారం ఆడి న్యాయవాదులను ప్రోత్సహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులను అందజేస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు ఉన్నారు.

తపాలా శాఖ జీవిత బీమా మేళా

నవతెలంగాణ-జైనథ్

తపాలా శాఖ వివిధ ఖాతాలు, గ్రామీణ తపాలా జీవిత బీమా విశిష్టత ను వివరిస్తూ శుక్రవారం ఉదయం మండలంలోని గిమ్మ గ్రామంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో జీవిత బీమా మేళాను నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటా తిరుగుతూ గ్రామీణ తపాలా జీవిత బీమా, సుకన్య సమృద్ధి, ఆర్‌డి, ప్రమాద బీమా పథకాల వివరాలను ప్రజలకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తపాలా ఇన్స్‌పెక్టర్ సుజీత్, ఎస్పీఎం సాయి కుమార్, మెయిల్ ఓవర్ సీయర్ భరత్, బ్రాంచి పోస్ట్ మాస్టర్‌లు దిగంబర్, సురేందర్, జీవన్, వెంకట్ రాజు, విజయ్, సాయి ప్రసన్న, సారిక, నవీన్, వినయ్, ప్రణీత్, లక్ష్మన్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో మరో 15 మంది డిబార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్‌లో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం జరిగిన డిగ్రీ పరీక్షల్లో రాష్ట్రంలో 19 డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అధికారులు మల్లారెడ్డి, నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ నుండే పదిహేను మంది ఉన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని నలంద కళాశాలలో ఆరుగురు, ఆసిఫాబాద్ లోని మాతృశ్రీ కళాశాలలో ముగ్గురు, ఆదిలాబాద్‌లోని విద్యార్థి కళాశాలలో ఇద్దరు, ఆదిలాబాద్ సైన్స్ కళాశాలలో ఇద్దరు, నిర్మల్ చాణక్య కళాశాలలో ఒక్కరు, కాగజ్‌నగర్ వివేకానంద కళాశాలలో ఒక్కరు చొప్పున డిబార్ అయ్యారు. ఎవరైనా కాపీయింగ్‌కి పాల్పడితే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

23న కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో పనిచేసే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత తొమ్మిది నెలల నుండి వేతనాలు రాక స్టాఫ్ నర్సులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్టాఫ్ నర్స్‌ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ పక్షాన 23న సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

దివ్యాంగులకు రైల్వే పాసుల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా నిరుద్యోగుల వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దాదాపు 200 మంది దివ్యాంగులకు రైల్వే పాసులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ చేతుల మీదుగా పాస్‌లను అందచేశారు. ఈ కార్యక్రమ విజయవంతానికి సహకరించిన వారికి సంఘం అధ్యక్షులు అబ్దుల్ సలీం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, అమనుల్లా ఖాన్, బండి నందు, పట్టణ అధ్యక్షులు రాకేష్, రాజశేఖర్, ఆకుల సునీల్ పాల్గొన్నారు.

అక్రమ మొరం తవ్వకాలు.. పట్టించుకోని అధికారులు..



నవతెలంగాణ-కుభీర్

అక్రమ మొరం తవ్వకాలు మండలంలో జోరుగా సాగుతున్నాయి. గుట్టు చప్పుడు కాకుండా అక్రమార్కులు తమ వ్యాపారాన్ని ముడుపువ్వులు ఆరుకాయలుగా దందాను కొనసాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టలను తవ్వేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ భూముల్లో, క్వారీల్లో అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతున్నారు. శుక్రవారం మండలంలోని హంపోలి గ్రామ సమీపంలోని చెరువులో అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతున్నట్లు పలువురు అవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఎలాంటి రాయల్టీలు చెల్లించకుండా, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి అక్రమ మొరం తవ్వకాలను అడ్డుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని ప్రకృతి సంపదను కాపాడాలని పలువురు గ్రామస్తులు కోరారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-కుభీర్

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బెల్గాం గ్రామానికి చెందిన సిందే దాజీరావు పటేల్ స్మారక క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై హాజరయ్యారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీలో 26 టీమ్‌లు పాల్గొనగా అందులో బెల్గాం తండా-1కు చెందిన జట్టు విజేతగా నిలిచింది. రెండో జట్టు దొద్రనా తండా, మూడో జట్టు తొటంబ జట్లు విజేతలుగా ప్రకటించారు. వారికి మొదటి బహుమతి రూ.10వేలు నగదు, రెండో బహుమతి రూ.7వేల 5వందలు నగదు, మూడో బహుమతి రూ.5వేలు నగదు షీల్డ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత ఎక్కువగా చెడు వ్యసనాలకు అలవాటు పడటం జరుగుతుందని, చెడు వ్యసనాలను వదిలి మంచి మార్గంలో నడువాలని అన్నారు. అదే విధంగా ఉన్నత చదువులు చదివి మంచిరంగంలో ముందుడాలని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు గ్రామస్తులకు మంచి పేరు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు అనిల్ శంకర్, చంద్రశేఖర్ పటేల్, ధర్మరాజు, మాజీ వైస్ ఎంపీపీ బాలాజీ పటేల్, మాజీ ఎంపీటీసీ శంకర్, మాజీ సర్పంచ్ పోశెట్టి, సీతారాం పటేల్, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఈ-శ్రామ్ కార్డులపై కార్మికులకు అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో కార్మికులకు శుక్రవారం బెల్లంపల్లి ఏఎల్ఓ సుకన్య, ఈ శ్రామ్ కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్మికులకు ఈ శ్రామ్ కోసం దరఖాస్తులు చేసుకునే విధానంతో పాటు వచ్చే లాభాలపై వివరించారు. అన్ని రంగాల కార్మికులు తప్పకుండా ఈ శ్రామ్ కార్డు అప్లై చేసుకోవాలని, భీమా వర్తిస్తుందన్నారు. అనంతరం కాసిపేట కామన్ సర్వీస్ సెంటర్ వద్ద ఈ శ్రామ్ కార్డులను కార్మికులకు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది ఉప్పులేటి మధువయ్య, కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు లాంటింకి శివ పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించండి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో చదువుతున్న విద్యార్థులు తమ పరీక్ష ఫీజును చెల్లించాలని కోఆర్డినేటర్ తూడూరి దత్తాత్రేయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్శిటీ ఫీజు చెల్లింపు తేదీని పొడగించిందని సెమిస్టర్-1, సెమిస్టర్-3, సెమిస్టర్-5 విద్యార్థులు ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని తెలిపారు. సైన్స్ విద్యార్థులు అదనంగా ప్రాక్టికల్ ఫీజును సైతం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 9866398678లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అక్రమ లేఅవుట్‌లో ప్లాట్లు కొని మోసపోవద్దు

- మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్



నవతెలంగాణ-నస్పూర్

అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొని ప్రజలు మోసపోవద్దని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ అన్నారు. నస్పూర్ మున్సిపల్ పరిధిలోని అక్రమ వెంచర్ల హద్దురాళ్లను శుక్రవారం కమిషనర్ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఉన్న 20వ వార్డు సీతారాంపల్లిలోని నాలుగు అక్రమ వెంచర్లను, 10వ వార్డులోని నాలుగు వెంచర్లను తొలగించినట్లు తెలిపారు. అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొన్నవారికి మున్సిపల్ నుండి గృహ నిర్మాణ అనుమతులు ఇవ్వడం జరగదని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీఎస్ సతీష్, బిల్ కలెక్టర్ శ్రీపతి సురేష్ పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు వెంటనే విడుదల చేయాలని బీజెవైఎం జిల్లా అధ్యక్షులు యెలాగతి సుచిత్ డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్ విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ జిల్లా కేంద్రంలో అంబేద్కర్‌చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల విద్యార్థుల రూ.5300 కోట్ల స్కాలర్ షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులను బకాయి ఉన్నాయని వెంటనే వాటిని విడుదల చేయాలన్నారు. నియంత పాలనలో నిరుపేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందని ద్రాక్షలా మారాయన్నారు. విద్యార్థులు ఐక్యమై పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు సంజీవ్, సుధాకర్, బీజేపీ జిల్లా నాయకులు శ్రవణ్‌గౌడ్, నాయకులు పులి సంజు, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జైరాజ్, సాయి, కార్తీక్, వినోద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలో శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్ కో టౌన్ ఏఈ కమలాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ నెలవారి మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కొనసాగుతున్న కంటి వెలుగు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని గట్రావ్పల్లి, బుగ్గగూడెం గ్రామ పంచాయతీల్లో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీంతో పాటు పల్లంగూడ గ్రామ పంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించగా కంటి వెలుగు కార్యక్రమానికి గ్రామస్తులు తరలివచ్చి సద్వినియోగం చేసుకున్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఎంఏ అలీం పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పెంద్రం రాజు, దుస్స విజయ, ఎంపీటీసీ చంద్రమౌళి, కార్యదర్శి తనూజ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో మరోసారి అధికారం

- ఎమ్మెల్యే రేఖానాయక్

నవతెలంగాణ-జన్నారం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే టిఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొస్తాయని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. శుక్రవారం పోన్కల్ సర్పంచ్ జక్కు భూమేష్, ఉపసర్పంచ్ బాలసాని శ్రీనివాస్‌గౌడ్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బచ్చల కృష్ణ ఆధ్వర్యంలో పోన్కల్ గ్రామపంచాయతీకి చెందిన పలువురు మహిళలు, గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. దళితుల కోసం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి వారి ఆర్థిక అభివృద్ధి కోసం పాటుపడుతున్న ప్రభుత్వం టిఆర్ఎస్ అన్నారు. షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, రైతు బీమా, రైతుబంధు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ప్రజలు మరోసారి టిఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువా జనార్ధన్, జిల్లా అధికార ప్రతినిధి సిటీమల భరత్ కుమార్, మండల మహిళా అధ్యక్షురాలు మామిడి సుశీల, కాంతామణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, నాయకులు రాగుల శంకర్ పాల్గొన్నారు.

ఎస్టిమేషన్ ఇవ్వకపోతే ఎలా మంజూరు చేస్తాం : రేఖానాయక్

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్ వెళ్లే రహదారి పూర్తిగా చెడిపోయిందని, రోటిగూడ వెళ్లడానికి వాగుపై వంతెన నిర్మాణం కోసం ఎస్టిమేషన్‌లు ఆ శాఖల అధికారులు తయారు చేసి ఇవ్వకపోతే ఎలా మంజూరవుతాయని ఎమ్మెల్యే రేఖానాయక్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపీపీ మాదాడి సరోజన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కానీ చాలామంది అధికారులు మండలంలో ఉండకుండా రాకపోకలు సాగిస్తూ అభివృద్ధికి ఆటంకం కల్గిస్తున్నారని తెలిపారు. సర్వసభ్య సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కాకపోవడంతో వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో అరుణారాణికి సూచించారు. వచ్చేది వేసవికాలం కనుక ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఇంటికి మంచినీరు అందించాలన్నారు. తండాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీపతి పద్మ బుచ్చన్న, వైస్ ఎంపీపీ సుతారి వినయ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రియాజుద్దీన్, ఎంపీడీవో అరుణరాణి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే దివాకర్‌రావు



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

పేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ఇంటికి పెద్ద కొడుకుగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, ఆసరా పింఛన్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇలాంటి పథకాలను గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టకపోగా, ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను చూసి ఓర్వలేక పోతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కరోనా కాలంలో కూడా సంక్షేమ పథకాలను ఆపలేదని గుర్తు చేశారు. అంతకుముందు వీకర్ సెక్షన్‌లో దుప్పట్లు పంపిణీ చేశారు. వార్డుల్లో తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ నల్మాస్ కాంతయ్య, వైస్ చైర్మెన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, డీసీఎంఎస్ చైర్మెన్ తిప్పని లింగయ్య, జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, ఎంపీపీ అన్నం మంగ, మండలాధ్యక్షుడు చుంచు చిన్నయ్య, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, కౌన్సిలర్లు, సర్పంచులు సొల్లు సురేష్, గణవేణి శైలజ సుధాకర్, జయంత్, ఎల్తాపు సునీతసుధాకర్, రాజేశం, బండి సత్తయ్య, దొంత నర్సయ్య, తహసీల్దార్ జ్యోత్స్న పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత

నవతెలంగాణ-నస్పూర్



కారుణ్య నియామకాలలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో నియామకం పొందిన 39 మంది యువతీ-యువకులకు శుక్రవారం ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ కారుణ్య నియామకాలు చేపడుతూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోందని అన్నారు. దక్షిణ భారతదేశంలోనే సింగరేణి సంస్థ దేశానికే తలమానికంగా ఉందని అన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు సర్పేస్‌లో లైట్ జాబ్ కోసం ప్రయత్నం చేయకుండా, గైర్హాజరు కాకుండా ఉద్యోగం చేసుకోవాలని అన్నారు. తమ తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ, క్రమశిక్షణతో ఉద్యోగం చేసుకోవాలని, సింగరేణి లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. సింగరేణిలో రెండో తరానికి ఉద్యోగాలు రావడం మీ అదృష్టంగా భావించాలని అన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించడానికి కృషి చేయాలని తెలిపారు. ఉద్యోగంలో నైపుణ్యాన్ని పొంది ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సీనియర్ ఉద్యోగుల సలహాలు సూచనలు తీసుకుని ప్రమాద రహిత సింగరేణిగా చేయాలని కోరారు. ఇప్పటి వరకు శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో 3102 కారుణ్య నియామక పత్రాలను జారీ చేయడం జరిగిందని తెలియజేశారు. సింగరేణి వ్యాప్తంగా 10558 కారుణ్య నియామక పత్రాలు జారీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ పీఓ కాంతారావు, డిప్యూటీ సూపరింటెండెంట్ మాటేటి వెంకట రాజయ్య పాల్గొన్నారు.

11వ వేతన సాధనలో బీఎంఎస్ కీలకపాత్ర

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కార్మికుల 11వ వేతన ఒప్పందం సాధించడంలో బీఎంఎస్ కీలకపాత్ర పోషించిందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే6 గనిలో బీఎంఎస్ కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. 11వ వేతన ఒప్పందం 19 శాతం సాధించడంలో జాతీయ నాయకులు, బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జ్, జేబీసీసీఐ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి నిరంతరం అవిశ్రాంతమైన కృషి ఫలితంగానే సాధ్యపడిందని తెలిపారు. గత నెలలో ఐదో తేదీ నుండి 9వ తేదీ వరకు సింగరేణి వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు, మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించడం ఈ విజయానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. గత వేతన ఒప్పందంలో మాదిరిగా మెడికల్స్ స్కీం, పెన్షన్, క్యాడర్ స్కీమ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరలో జరుగు జేబీసీసీఐ సమావేశంలో చర్చించి త్వరలోనే పరిష్కారం చేయనున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం పెరిగి ఆర్థిక మాంద్యం ఏర్పడటం ఆర్థిక కుంభకోణాలు సంస్థకు రావాల్సిన విద్యుత్తు, బొగ్గు బకాయిలు రూ.25 వేల కోట్లు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో శరవేగంగా పెరుగుతున్న ప్రయివేటీకరణ నిలిపివేయుటకు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు అప్పని శ్రీనివాస్, కాసెట్టి నాగేశ్వరరావు, కాదాసి భీమయ్య, వినోద్‌కుమార్, పంచర్పుల నరేష్, పూనం రామకృష్ణ, గోపతి సందీప్, మేకల స్వామి, నాగార్జున, రాజు పాల్గొన్నారు.

హాత్ సే హాత్ జోడో అభియాన్ సన్నాహక సమావేశం

నవతెలంగాణ-కాసిపేట



మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్మారావు పేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఏఐసీసీ పిలుపు మేరకు రాహుల్ గాంధీ జోడో యాత్ర ముగింపు కార్యక్రమానికి కొనసాగింపుగా హత్‌సే హత్ జోడో అభియాన్ మండలంలో సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ మంత్రి గడ్డం వినోద్ వెంకటస్వామిలు పాల్గొని మాట్లాడారు. మండల పరిధిలో హత్‌సే హత్ జోడో అభియాన్ కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ప్రజలకు చేసే పనులను చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల కృష్ణ, సిద్ధం తిరుపతి, పార్వతి మల్లేష్, ఎంపీటీసీ భీంరావు, మెరుగు పద్మశంకర్‌లు, గోలేటి స్వామి, ఉపసర్పంచ్ కనుకుల రాకేష్, రాజమౌళి, అన్నం కుమార్, కనక రాజు, అనంతరావు, జంగిలి రమేష్, మహంకాళి, జాడి శంకర్, గోపు శ్రీనివాస్, కొత్త రమేష్, మైదం రమేష్, జాడి శివ, రాజుకుమార్ పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో మరింత నాణ్యత పాటించాలి

- జిల్లా ఎస్పీ కే సురేష్‌కుమార్
- పెండింగ్ కేసులపై సమీక్ష సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేసుల దర్యాప్తులో మరింత నాణ్యత పాటించాలని పెండింగ్ కేసులు లేకుండా చూడాలని జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ పోలీస్ సిబ్బంది ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని హెడ్ క్వార్టర్స్‌లో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో మరింత నాణ్యత ప్రమాణాలు పెంచాలన్నారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలని, రౌడీలు, కేడీలు సస్పెక్ట్‌ల యొక్క కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పెండింగ్ ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి పోలీసు అధికారులందరూ న్యాయధికారులతో సమన్వయం పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పెండింగ్ కేసులను పూర్తిస్థాయిలో ఇన్వెస్టిగేషన్ చేసి డిస్పోజల్ చేయాలని సూచించారు. ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. 60 రోజుల్లో ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. రాత్రి పెట్రోలింగ్‌లో అధికారులు లాడ్జిలు, పాత నేరస్తులను తనిఖీ చేయాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వరరావు, అదనపు ఎస్పీ (ఎఆర్) భీమ్‌రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, డీసీఆర్‌బీ డీఎస్పీ నాగేందర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలో మున్నూరుకాపు సంఘం భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ మల్లిఖార్జున్‌కు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మండలంలో మున్నూరు కాపు జనాభా సుమారు 12 వేలకుపైగా ఉంటుందని, మండల కేంద్రంలో సమావేశాలు, శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ఎలాంటి వసతిలేదని మున్నూరు కాపు సంఘం నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి, ప్రధాన కార్యదర్శి మిట్ట దేవేందర్, సంఘం నాయకులు కుందారపు బసవయ్య, కార్నాదం చంద్రయ్య, కొవ్వూరి శ్రీనివాస్, కుందారపు శంకరమ్మ కార్తీక్, మల్లేష్, ఆశన్న, వినోద్, అశోక్, వెంకటేశ్, సత్యనారాయణ, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.



సమన్వయంతో పనులు చేయాలి



నవతెలంగాణ-రెబ్బెన

సమన్వయంతో పనులు చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం జి దేవేందర్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియా పీహెచ్‌సీలో పనిచేసే ఉద్యోగులకు సేఫ్టీ మేనేజ్‌మెంటు ప్లాన్ అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పనిలో నిబంధనలకు మించిన వేగంతో చేయడమే ప్రమాదాలకు మూలకారణమన్నారు. ఒక షిఫ్టులో ఉత్పత్తి తగ్గితే మరో షిఫ్టులో రెట్టింపు ఉత్పత్తి సాధించవచ్చన్నారు. కానీ ప్రమాదంలో కోల్పోయే ప్రాణాలు తిరిగి రావన్నారు. పర్యవేక్షకులు, ఉద్యోగులు సమన్వయంతో సక్రమమైన మార్గంలో సమయానుకూలంగా పనులు చేస్తే ప్రమాదాలు లేని సంస్థగా సింగరేణి నిలుస్తుందన్నారు. ఎస్ఎంటీటీ, ఎఫ్ఓఎం జీవీఎస్ విజయ్‌కుమార్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ అమలుపై ఉద్యోగులకు ప్రొజెక్టర్ ద్వారా రక్షణతో చేసే పనులపై అవగాహన కల్పించారు. పలు దేశాల్లో పాటిస్తున్న రక్షణ సూత్రాలు, పద్ధతులను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం కెహెచ్‌ఎన్ గుప్తా, ఏజీఎం ఎం తిరుమలరావు, డీజీఎం(సీహెచ్‌పీ) జాడె భీంరావు, సీపీఓసీ(2) మేనేజర్ మహేష్‌కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలోని బంగారు ఆభరణం అపహరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని కాపువాడకు చెందిన 80 ఏండ్ల వృద్ధురాలు ముంజం లచ్చమ్మ మెడలోని కుతికట్టును గుర్తు తెలియని దుండగుడు శుక్రవారం లాక్కెళ్లినట్లు బాధితురాలు తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం తనకు ఎవరు లేరని, ఎవరు లేని కారణంగా వరుసకు కోడలైన చిట్యాల అంకు వద్ద నివాసం ఉంటుంది. తన ఇంటి ఆవరణలోని జామ చెట్టు కాయలు విక్రయించడానికి రైల్వే స్టేషన్ ఆవరణలోని రైల్వే బ్రిడ్జిపై నుండి వెళుతున్న క్రమంలో ఒక వ్యక్తి ఆపి జామ కాయలు కొంటనన్నాడు. అయితే డబ్బులు ఇంటి వద్ద ఉన్నాయని ఇంటికి రావాలని వెంట తీసుకెళ్లాడు. కాపువాడలోని కట్టే మిషన్ సమీపంలోని సందిలోకి తీసుకెళ్లి ఒక్కసారిగా దాడి చేసి మెడలోని బంగారు కుతికట్టు దొంగలించాడు. కుతికట్టు లాగే క్రమంలో కొన్ని బంగారు బిల్లలు తన చీరపై పడినట్లు ఆమె స్పష్టం చేశారు. పొట్టిగా, తెల్లరంగు దుస్తులు ధరించిన వ్యక్తిగా బాధితురాలు తెలిపింది. ఈ విషయంతో బాధితురాలు రైల్వే పోలీసులకు సమాచారం అందించినట్లు వివరించింది.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

రైతులు చిరు ధాన్యాల సాగుపై దృష్టి సారించాలని ఏడీఏ మనోహర్ సూచించారు. మండలంలోని బోడపల్లి గ్రామంలో అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని శుక్రవారం రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. ఏఓ రామకృష్ణ మాట్లాడుతూ రైతులు చిరుధాన్య పంటలైన రాగులు, సజ్జలు, కొర్రలు, సామలు, జొన్నలు సాగు చేయాలని తెలిపారు. అరికలు, ఉదలు చిరుధాన్యాలలో అధిక పోషక విలువలు ఉంటాయన్నారు. చిరుధాన్యాలలో బి-విటమిన్లు, అమైనా ఆసిడ్స్, మాంసకృత్తులు అధికంగా ఉంటాయని, ప్రత్యేకంగా ఇందులో ఖనిజ లవణాలు, ఐరన్ మెగ్నీషియం, పొటాషియం అధికంగా ఉంటాయని తెలిపారు. ఏఈఓ యువరాణి మాట్లాడుతూ చిరుధాన్యాల వంటకాలు నిండైన ఆరోగ్యానికి మెండైన రుచులు అని చెప్పారు. చిరుధాన్యాలను ప్రతిరోజు తీసుకోవడంతో మధుమేహ వ్యాధులను తగ్గించుకోవచ్చన్నారు. చిరుధాన్యాలను పండించడం వల్ల ఖర్చును తగ్గించుకోవచ్చని తెలిపారు. అనంతరం గ్రామంలో చిరు ధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కల్లెపల్లి మీనారాజన్న, ఎంపీటీసీ శ్యాంరావు, రైతులు పాల్గొన్నారు.

పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



నవతెలంగాణ-జైపూర్

అనేక సందర్భాల్లో ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన బీజేపీ నాయకులు ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ సుందిళ్ల మల్లేష్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ పిలుపు మేరకు శుక్రవారం బీజేపీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అందుగుల శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించడం కోసం జాతీయ నాయకులను ఒప్పించాలని కోరారు. 28 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ పోరాటం కొనసాగుతోందని, పలు సందర్భాల్లో వర్గీకరణకు బిజెపి నాయకత్వం మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షులు రామగిరి రాము, ప్రధాన కార్యదర్శి నిట్టూరి ప్రశాంత్, ఉపాధ్యక్షులు తుంగపిండి సాయి, జిల్లా నాయకులు రాసపాక మల్లేష్, తుంగపిండి మల్లేష్, రామగిరి అభి, సునీల్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు భూమి గుర్తింపు

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని పేలాల గ్రామంలో నిర్మించ తలపెట్టిన అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ కు అవసరమైన స్థలాన్ని గుర్తించినట్లు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి వేలాల శివారులో భూమిని గుర్తించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.25లక్షలతో 400 గజాల విస్తీర్ణంలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ క్రీడా ప్రాంగణం కోసం అవసరమైన భూమిని గట్టు మల్లన్న ఘాట్ రోడ్డులో గుర్తించినట్లు తెలిపారు.

కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ అధికారుల బృందం పర్యటన

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

గిరిజన కొలాం, తోటి కులస్తుల స్థితిగతులను అధ్యయనం, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలను పరిశీలించేందుకు కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ కారుల బృందం జిల్లాలో పర్యటించిందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బృందం అధికారులు గిరిజన మంత్రిత్వ కోలాం కమ్యూనిటీ అండర్ సెక్రెటరీ కె. చంద్రశేఖర్, అస్సాం ట్రైఫెడ్ తోటి కమ్యూనిటీ డిప్యూటీ మేనేజర్ పామ్ థింగ్ క్రిషింగ్, గిరిజన సంక్షేమ శాఖ టీఆర్ఐ జాయింట్ డైరెక్టర్ సముజ్వల, అసిస్టెంట్ మ్యూజియం క్యూరేటర్ శైలజ కలిసి పర్యటన వివరాలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలోని రామడుగు, ధర్మిజీపేట, కామాయి పేట కొలాం గ్రామాలు, పూనగూడ, వాఘపూర్, దివ్యగూడ తోటి గ్రామాలను సందర్శించినట్లు కలెక్టర్‌కు సభ్యులు వివరించారు. వారి వెంట ఐడీటీఏ పరిపాలనాధికారి రాంబాబు, ఎపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి

జన్నారం : మండల కేంద్రంలో సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని తెలుగుదేశం ఆదిలాబాద్ పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం ఎంపీపీ మాదాడి సరోజన, ఎంపీడీవో అరుణాజికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి 29 గ్రామాల నుంచి రోజు ఎంతోమంది వచ్చిపోతూ ఉంటారని, సులబ్ కాంప్లెక్స్ లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి మంగళవారం పెద్ద ఎత్తున సంత జరగడంతో వ్యాపారస్తులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. వెంటనే అధికారులు స్పందించి మండల కేంద్రంలో సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరారు.



పునరావాస ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



నవతెలంగాణ-కడెం

మండలంలోని మైసంపేట్, రాంపూర్ గ్రామాల ప్రజల పునరావాసానికి ప్రభుత్వం నిర్మిస్తున్న ఇండ్లకు శుక్రవారం ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అటవీ ప్రాంతంలో నివసించే గిరిజలను బయటకు తీసుకొని వచ్చి సకల సదుపాయాలను కల్పించి అటవీ రక్షణ కోసం కృషి చేస్తుందని అన్నారు. ఇందులోనే భాగంగా మైసంపేట్, రాంపూర్ గ్రామాల ప్రజల కోసం కొత్త మద్దిపడగ గ్రామ శివారులో ఇండ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరలోనే అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం మండల కేంద్రంలో నియోజకవర్గ అభివృద్ధి నిధులతో మహిళ సంఘ భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు జీవన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కానూరు సతీష్, కొత్త మద్దిపడగ సర్పంచ్ జాడి రాజమణి పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాతో అందుబాటులోకి వైద్యం

- ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బస్తీ దవాఖానాతో ప్రజలకు అందుబాటులోకి వైద్యం రానుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బస్తీ దవాఖాన వల్ల వైద్యం మరింత అందుబాటులోకి రానుందన్నారు. పట్టణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం వీటిని ప్రారంభించినట్లు వివరించారు. జిల్లా ప్రజలు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం టిఆర్‌నగర్‌లో నిర్మాణం పూర్తయిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రభాకర్‌రెడ్డి, జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్, డిప్యూటీ వైద్యాధికారి సుధాకర్ నాయక్, వైద్యులు సత్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా రక్షణ కొరకు పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల ప్రభుత్వ భూములను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా ఫెన్సింగ్‌తో పాటు ప్రభుత్వ భూమి అని సూచికలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించి రక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమించుకుంటే కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహనరావు, సర్వేయర్ భరత్, పంచాయతీ రాజ్ ఈఈ రామ్మోహనరావు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యంగా కంటి వెలుగు



నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంధత్వ నివారణే లక్ష్యంగా కెసిఆర్ ప్రభుత్వం ప్రత్యేక కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం మారుమూల అటవీ ప్రాంతమైన అడవి సారంగాపూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు. ప్రతి ఒక్కరూ ఉచిత కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని, అలాగే అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులు ఉచితంగా ప్రభుత్వమే పంపిణీ చేస్తుందని తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో కిషన్, సిఐ అజయ్ బాబు, ఎంపీఓ చంద్రశేఖర్, ఎంపీపీ మోయిద్, వైస్ ఎంపీపీ వాల్ సింగ్, నిర్వచింతల్ సర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు.

ఆదర్శ అంగన్వాడీ సెంటర్‌కు భూమిపూజ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో నిర్మించ తలపెట్టిన ఆదర్శ అంగన్వాడీ సెంటర్‌కు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, జెడ్పి చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్ల ద్వారా నాణ్యమైన వస్తువులు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పూర్వ ప్రాథమిక విద్యలో అంగన్వాడీ కేంద్రాలు ఎంతో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఆదర్శ అంగన్వాడి కేంద్రాల ద్వారా మరింత నాణ్యమైన సేవలు అందనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేష్, సింగల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహన్‌రావు, మహిళ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి సావిత్రి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో అభివృద్ధిని ప్రచారం చేయాలి



నవతెలంగాణ-తాండూర్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. శుక్రవారం హాత్ సే హాత్ జూడో కార్యక్రమ నిర్వహణపై తాండూరు ఐబీలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జనవరి 26 నుండి హాత్ సే హాత్ జూడో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు నియోజకవర్గాల్లో గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేను పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలను కాంగ్రెస్ వైపు దృష్టి సారించేలా చేయాలని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తల కోసం బీమా సౌకర్యాలను కొనసాగిస్తుందని తెలిపారు. నాయకులు బూత్ స్థాయిలో కార్యకర్తల మెంబర్షిప్ చేయాలన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం జనాకర్షణ పథకాలు పెట్టి అభివృద్ధిని విస్మరించిందని, ఇది ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియజేయాలన్నారు. కొన్ని నెలల్లోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ప్రతి కార్యకర్త కష్టపడి పార్టీని అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు గడ్డం వినోద్, బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి ప్రభాకర్, బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చిలుముల శంకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పెండ రజిత, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి రొడ్డ శారద, డిసిసి సభ్యులు గట్టు మురళీధర్‌రావు, సూరం రవీందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాపరి సుభాష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పుట్ట శ్రీనివాస్, సీనియర్ నాయకులు మాసాడి ప్రభాకర్ పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో 26న నిర్వహించే 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని దీనికోసం జిల్లాలోని అన్ని శాఖల నుండి ఉత్తమ అధికారుల ఎంపిక చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్పేయిలతో కలిసి అన్ని శాఖల అధికారులతో గణతంత్ర వేడుకలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహించే గణతంత్ర వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. దీనికోసం వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు వేడుకలకు వచ్చేవారికి తాగునీటి సౌకర్యంతో పాటు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. జిల్లాలోని ప్రతి శాఖ నుండి బాగా పని చేస్తున్న వారిని ఉత్తములుగా ఎంపిక చేసి పంపించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ఆయా శాఖల్లో ఉన్న పురోగతిని తెలియజేస్తూ శాఖల సమన్వయంతో ప్రగతి నివేదిక సిద్ధం చేయాలన్నారు. శాఖల వారిగా శకటాల ప్రదర్శన చేయాలని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ భీంరావు, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వర్, డీపీఓ రమేష్, డీఆర్డిఓ సురేందర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



నవతెలంగాణ-భీమారం

గత సంవత్సరం ఇచ్చిన మాటకు కట్టుబడి బంజార కులస్థుల ఆరాధ్యదైవమైన శ్రీ జగదాంబ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు బంజార కులస్థులు ధన్యవాదాలు తెలియజేశారు. బూరుగుపల్లిలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భుక్య రాజ్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆరాధ్యదైవమైన సేవాలాల్ జయంతి వేడుకల్లో బాల్క సుమన్ ఆలయ నిర్మాణం కోసం ప్రభుత్వ నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామి ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఆలయ నిర్మాణాని రూ.12లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. తమ గూడెం చిరకాల కోరికను నెరవేర్చిన సుమన్‌కు గూడెం తరుపున ధన్యవాధాలు తెలిపారు. అంతే కాకుండా త్వరలోనే శంకుస్థాపన చేసి 2024లో నిర్మాణం పూర్తిచేసి నూతన ఆలయంలో సేవాలాల్ జయంతి ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్లకొండ రమాదేవి, జడ్పీటీసీ భుక్య తిరుమల, ధరావత్ నారాయణ, దేవ్‌నాయక్, గణేష్ నాయక్, ధరావత్ రాజు నాయక్, తండావాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ సిక్తా పట్నాయక్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌కలెక్టరేట్

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్ సేఫ్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ, అంతర్ రాష్ట్ర, గ్రామీణ రహదారులపై ప్రమాదాల పాయింట్‌లను గుర్తించి సత్వర చర్యలు చేపట్టాలని అన్నారు. జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, పోలీస్, రవాణా శాఖల అధికారులు జిల్లాలో ఆక్సిడెంట్ ప్రోన్‌లను గుర్తించి అవసరమైన పనులకు, చర్యలకు త్వరలో నివేదికలు అందజేయాలని అన్నారు. అందుకు ఆయా శాఖల అధికారులు జాయింట్ ఇన్స్‌పెక్షన్ నిర్వహించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎస్పీ డి ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బోరజ్, మేకల గండి, సీతగొంది, కుప్టి బ్రిడ్జి, ఉట్నూర్ మండలం పులిమడుగు, తదితర ప్రాంతాలలో ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. వాటిని నియంత్రించే విధంగా నియంత్రికలను, సూచికలను ఏర్పాటు చేయాలనీ అన్నారు. కొన్ని బ్రిడ్జిల వద్ద సూచికలు లేనందున రాత్రి వేళల్లో వాహన దారులకు ఇబ్బంది ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గుడిహత్నూర్ నుండి ఆదిలాబాద్ జాతీయ రహదారి గుండా వచ్చే వాహనాలు న్యూట్రల్‌లో రావడం వలన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, సాంకేతిక పరంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. బోరజ్ చెక్ పోస్ట్ వద్ద వాహనాలు సర్వీస్ రోడ్లపై నిలపడం వలన వాహన దారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని సమావేశంలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ అధికారుల సహకారంతో ప్రమాదాలను అరికట్టడానికి సహకరిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్ నటరాజ్, ట్రైనీ సహాయ కలెక్టర్ పీ శ్రీజ, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పి శ్రీనివాస్, రోడ్లు భవనాల శాఖ ఈఈ నర్సయ్య, పంచాయితీ రాజ్ ఈఈ మహావీర్, మున్సిపల్ కమిషనర్ శైలజ, ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి పాల్గొన్నారు.



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

జిల్లాలో నేరాలు, ప్రమాదాలను ఎప్పటికప్పుడు పరిశీలించి తెలుసుకునేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ క్వార్టర్స్ సమీపంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజలు పరిశీలించారు. ఆదిలాబాద్ పట్టణంలో పలు జంక్షన్‌లు, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, మరిన్ని చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉందని ఎస్పీ కలెక్టర్‌కు వివరించారు. కంట్రోల్ రూమ్ పనితీరును సంబంధిత సాంకేతిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

12న సింగరేణి పాఠశాల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి పాఠశాల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం ఫిబ్రవరి 12వ తేదీ ఆదివారం వైభవంగా జరుపనున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. శుక్రవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. 44 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో పాఠశాలల్లో విద్యను ప్రదర్శించిన సుమారు 4000 మంది పూర్వ విద్యార్థులు, విద్య నేర్పిన సుమారు 200 మంది గురువులను, పాఠశాలను నిర్వహించిన సింగరేణి సంస్థ ప్రతినిధులు ఈ సమ్మేళనంలో పాల్గొంటారని తెలిపారు. ఇప్పటివరకు సమాచారం తెలియని పూర్వ విద్యార్థులందరికి తెలిసిన విద్యార్థులు సమాచారాన్ని తెలియజేయాల్సిందిగా సమన్వయకర్తలు కే వాణిశ్రీ, సి.రాజారెడ్డి, కోర్ టీం సభ్యులు కోరారు. ఈ మహా సమ్మేళన కార్యక్రమాన్ని సీసీసీ సింగరేణి పాఠశాల పూర్వ విద్యార్థి సంఘంగా ఏర్పడి విద్యార్థులకు ప్రస్తుత విద్యార్థులకు బాహ్య సమాజానికి ఉపకరించే విధంగా ఒక చారిటబుల్ ట్రస్ట్ రిజిస్టర్ చేసుకోబోతున్నట్లు తెలిపారు. ఈ చారిటబుల్ ట్రస్ట్‌ని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి చే ఆవిష్కరించబోతున్నట్లు సమన్వయకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన సీఎం కేసీఆర్

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిస్థాయిలో విఫలమయ్యారని బిజెపి రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆమె చేపట్టిన పోరాటంలో భాగంగా శుక్రవారం భుక్తాపూర్ కాలనీలో పర్యటించారు. ఈ మేరకు కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో చాలామంది నిరుపేదలకు సొంత ఇండ్లు లేవని తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఆమె వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

అగ్నిప్రమాదంలో రూ.4లక్షల ఆస్తి నష్టం

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలో ఐటీడీఏ క్వాటర్‌లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జు నివాసంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఇంటిలో పొగలు వ్యాపించాయి. సమీప క్వార్టర్‌లో ఉన్న కుటుంబ సభ్యులు మూడు గంటల ప్రాంతంలో దట్టమైన పొగలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారిని పిలిచి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపులోకి తీసుకోచ్చారు. ఇంటిలో అగ్నిప్రమాదం జరిగిందని పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, ఇంటి సమీపంలో ఉన్న ప్రజలు బోజ్జుకి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఇంటికి వచ్చిన బొజ్జు దంపతులు పరిశీలించారు. ఇంటిలో బెడ్ రూమ్‌లో సుమారుగా రెండు లక్షలకుపైగా నగదుతో పాటుగా 5 తులాల బంగారం, వెండి, కీలకమైన పత్రాలు, బట్టలు, తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయినట్లు బొజ్జు పేర్కొన్నారు. నా భార్య ప్రభుత్వ ఉద్యోగిగా ఉందని పైసా పైసా కూడబెట్టి దాచుకున్న డబ్బులు, బంగారం కూడా కాలిపోవడం ఆందోళనకరమని ఆయన అన్నారు. అప్పటి వరకు ఇంట్లో ఉన్న తాము పనుల నిమిత్తం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు వెళ్లిన కొద్దీ సమయంలో మంటలు చెలరేగడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నివాసంలో కేవలం పడక గది మాత్రమే కాలిపోవడంపై అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్, ఐటీడీఏ ఏపీఓ జనరల్ కనక భీంరావ్, ఎస్సై భరత్ సుమన్, పార్టీ నాయకులు బొజ్జును పరామర్శించారు. సంఘటనకు గల కారణాలు తెలుసుకున్నారు.

కుటుంబానికి ఆర్థిక సాయం



జైపూర్ : ఇటీవల మృతి చెందిన కిష్టయ్య కుటుంబానికి శుక్రవారం టిఆర్ఎస్ నాయకులు ఆర్థిక తోడ్పాటు అందించారు. పేదలైన దొడ్ల కృష్ణయ్య కుమారుడు దొడ్ల ఆనంద్‌కు సర్పంచ్ భర్త నామాల తిరుపతి, ఉప సర్పంచ్ తంగళ్లపల్లి వెంకటేష్ రూ.2వేలతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. దొడ్ల కిష్టయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా దీనికి ముందే కృష్ణయ్య భార్య మృతి చెందింది. తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందడంతో నిరాశ్రయులైన కుటుంబ సభ్యులకు తమ వంతుగా సర్పంచ్ భర్త, ఉప సర్పంచ్ ఆర్థిక తోడ్పాటు అందించారు.

ఆర్థిక సాయం అందజేత

రామకృష్ణాపూర్ : తవక్కల్ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు అబినైజర్ పక్షవాతం వచ్చి వారు వారి కుటుంబం ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని తెలుసుకున్న జీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రాజ రమేష్‌బాబు వెంటనే స్పందించి వారి మిత్రబృందం 25కేజీల బియ్యం, రూ.5వేల కిరాణా సామాను, అందజేశారు. ఈ సందర్భంగా జీఎస్ఆర్ మిత్ర బృందం మాట్లాడుతూ అబినైజర్ త్వరగా కొలికొని తవక్కల్ పాఠశాలలో తిరిగి విధులు నిర్వర్తించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పొన్నాల సాగర్, ఉప్పులపు సురేష్, రమేష్, ప్రకాష్, అజయ్, జగదీష్, ఉదయ్ పాల్గొన్నారు.



తపాలా పథకాలపై ఇంటింటా ప్రచారం

నవతెలంగాణ-గుడిహత్నూర్

తపాలా శాఖ ద్వారా గ్రామీణ ప్రజలకు అందజేస్తున్న పథకాలపై తపాలా అధికారులు మండలంలో శుక్రవారం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ సబ్‌డివిజన్ ఎంఓ మునీర్ మాట్లాడారు. పిల్లల పేరిట నేడు చేసిన పొదుపు భవిష్యత్తులో పిల్లల చదువుల కోసం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సుకన్య సమృద్ధి యోజన, ఆర్డీ, ఎస్బీ, గ్రామీణ తపాలా జీవిత బీమా గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తపాలా శాఖలో పొదుపు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, బీపీఎంలు రవీందర్‌రెడ్డి, కీర్తన, జ్యోతి, రాములు, విలాస్, రోహిదాస్, ఖుర్షీద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని కైలాసనగర్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల నిమిత్తం నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కైలాసనగర్ ఫీడర్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు, కుమ్మరివాడ, శాంతినగర్, పాలిటెక్నిక్ ఫీడర్ ఏరియాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

స్కౌట్స్, గైడ్స్‌లో పిట్టబొంగరం పాఠశాల

ఇంద్రవెల్లి : ఐటీడీఏ పరిధిలోని 16 ఆశ్రమ పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ శిక్షణ కేంద్రాలను ప్రారంభించినట్లు ఉపాధ్యాయులు ఆత్రం భుజంగ్‌రావ్ తెలిపారు. శుక్రవారం పిట్టబొంగరం ఆశ్రమ పాఠశాలలో 32 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. వీరికి శిక్షకులుగా దుర్వ జంగు నియమితులయ్యారు. స్కౌట్స్, గైడ్స్ నిర్వాహకులు ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. స్కౌట్స్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఉద్యోగ నియామకాల్లో 2శాతం రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మెస్రం మనోహర్, సుభాష్ పాల్గొన్నారు.